


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్ గిరి | మంగళవారం | 01-09-2026 | సంపుటి : 3 | సంచిక: 209 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 01-09-2026 | VOLUME : 3 | ISSUE : 209 | PAGES: 8 | COST: 2/-

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

## నోయిడాలో మరో నిర్భయ ఘటన

4



## అంబర్‌పేట అభివృద్ధికి ఎంతో చేస్తున్నాం

- రెండేళ్లలో మూసారాంబాగ్ బ్రిడ్జిని నిర్మించాం
- పదెకరాల్లో పేదలకు ఇళ్లు కట్టిస్తున్నాం
- వెయ్యి రోజుల పాలనపై కార్యాచరణ తీసుకున్నాం
- మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి ప్రారంభ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- రూ.52 కోట్లతో 400 మీటర్ల పొడవైన బ్రిడ్జి నిర్మాణం
- మెరుగు కానున్న అంబపేట, మూసారాంబాగ్ కనెక్టివిటీ

**హైదరాబాద్, ఆగస్టు 31 :** విశ్వనగరంగా మారి విద్య, ఉద్యోగావకాశాలతోపాటు ఐటీ, సినిమా పరిశ్రమలకు అవకాశం ఇచ్చింది.. హైదరాబాద్ నగరం ప్రపంచంతో పోటీపడేలా ముందుకు పోతోంది.. ఎంత వేగంగా జనాభా పెరుగుతుందో అంత వేగంగా మౌలిక వసతులను పెంచుకోలేకపోతున్నాం అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్, తెలంగాణను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్తున్నామని, తెలంగాణను క్యూర్

మిగతా 3వ పేజీలో..



# కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి జ్వాలలు

- మూడేళ్లయినా పదవుల కోసం ఎదురుచూపులు
- నామినేటెడ్ పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం
- ఎమ్మెల్యేల సిఫారసులపై సందిగ్ధత
- పాత కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందనే ఆవేదన
- క్షేత్రస్థాయిలో తగ్గుతున్న రాజకీయ ఉత్సాహం

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడేళ్లు కావస్తున్నా పార్టీ కోసం పనిచేసిన ద్వితీయ శ్రేణి నేతలు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు అధికారంలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం దక్కడం లేదనే అసంతృప్తి పెరుగుతోంది. కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థలు, దేవాలయ ట్రస్ట్ బోర్డులు, డీసీసీబీలు, పీఏసీఎస్ వంటి వందలాది నామినేటెడ్ పోస్టుల్లో ఇంకా అనేక ఖాళీలు ఉండటంతో పార్టీ కేడర్‌లో నిరాశ నెలకొంది. ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన కార్యకర్తలు తమకు గుర్తింపు, పదవులు దక్కడం లేదనే భావనతో రాజకీయంగా వెనుకంజ వేస్తున్నారనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

మిగతా 2వ పేజీలో..



## యుద్ధానికి ముగింపు పలకాలి..

- శాంతి ప్రయత్నాలకు భారత్ మద్దతు: మోడీ
- పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం
- ఉక్రెయిన్ సంక్షోభంపై కీలక వ్యాఖ్యలు
- చర్చలు, దౌత్యంతోనే పరిష్కారం
- 'ఇది యుద్ధ సమయం కాదు' అన్న వైఖరి పునరుద్ఘాటన
- త్వరలో భారత్‌కు రానున్న పుతిన్

4

## పెజెష్కియాన్‌తో మోడీ కీలక భేటీ..

- ఉద్రిక్తతల వేళ భారత్-ఇరాన్ సంబంధాలపై చర్చ
- బిష్కెక్‌లో ఇరువురు నేతల ద్వైపాక్షిక సమావేశం
- యుద్ధం తర్వాత తొలిసారి ప్రత్యక్ష భేటీ
- పరస్పర సహకారాన్ని మరింత విస్తరించడంపై దృష్టి
- పాషిన్యాన్‌తోనూ మోడీ ద్వైపాక్షిక భేటీ

4

## అగ్రిస్టాక్ అమలులో తెలంగాణ భేష్

- తొలి మైలురాయి దాటినందుకు రూ.175 కోట్ల ప్రోత్సాహకం
- డిజిటల్ వ్యవసాయంలో రాష్ట్రం అగ్రగామి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ఆగస్టు 31 :** అగ్రిస్టాక్ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ అమలులో రాష్ట్రం మరో కీలక మైలురాయిని సాధించింది. రైతులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందించేందుకు చేపట్టిన అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని విజయవంతంగా దాటినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.175 కోట్ల ప్రోత్సాహక నిధులు మంజూరు చేయడానికి ఆమోదం

మిగతా 2వ పేజీలో..



## 'చేయూత' దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

- మంత్రి సీతక్క ఆదేశాల మేరకు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ, దివ్యాంగుల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 31 :** చేయూత సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం మరో 15 రోజులపాటు పొడిగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఆగస్టు 315 వరకు పొడిగిస్తూ నిర్ణయం

మిగతా 2వ పేజీలో..





## కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం

- తెలంగాణకు తీరని ద్రోహం
- మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్
- కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్ర
- బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు

2



## ప్రతిష్ఠాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- సమావేశానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరు

**హైదరాబాద్, ఆగస్టు 31 :** ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్ఠాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రజా ప్రభుత్వం నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లపై ప్రజాభవన్‌లో సోమవారం ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. సమావేశానికి

మిగతా 2వ పేజీలో..

## గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వార్షికోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

2

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- భూ-రీసర్వే వేగవంతం చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకోవాలి
- నత్తనడకన సాగే జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులో వుండాలి
- రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్ల మంజూరు
- రెవెన్యూ మంత్రి పొంగులేటి

3



## సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించాలి

- 'తెలంగాణ-జర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించండి
- జీఐజీఏ ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు వినతి

2

## సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ

- జలశక్తి సదస్సులో తెలంగాణ సమగ్ర జలభద్రత నమూనా
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3

## టవర్స్ తో నెరవేరుతున్న సొంతింటి కల

- 16 నియోజకవర్గాల్లో 7340 ఫ్లాట్ల కేటాయింపు
- నాలుగు రోజులపాటు కొనసాగిన లాటరీ ప్రక్రియ
- పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎంపిక



3

# కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతుంటే మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా నీటిని తరలిస్తోందన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. ఇలా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తున్నదన్నారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని నిలదీశారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# 'చేయూత' దరఖాస్తులకు 15 రోజుల గడువు పెంపు

**మొదటిపేజీ తరువాయి**

తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యంగా హైదరాబాదులో కొనసాగుతున్న 'సర్' ప్రత్యేక ప్రక్రియ కారణంగా పలువురు అర్హులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించలేకపోతున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ముఖ్యంగా దివ్యాంగులు తమకు మరికొంత సమయం ఇవ్వాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ విజ్ఞప్తులను సానుకూలంగా పరిగణించిన మంత్రి సీతక్క అర్హులైన ఒక్కరు కూడా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కోల్పోకూడదని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజులపాటు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన పేద కుటుంబాల వారు ఆగస్టు 315 వరకు తమ దరఖాస్తులను సమర్పించుకునే అవకాశం లభించింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సామాజిక భద్రతా పెన్షన్లు పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని అన్నారు. అర్హత ఉన్న ఒక్క పేదవాడు, దివ్యాంగుడు సమాచారం లేకనో, ఇతర కారణాల వల్లనో ప్రభుత్వ సంక్షేమ పథకానికి దూరం కాకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దివ్యాంగులు తమ సమస్యలను, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, వారి అభ్యర్థనను మానవీయ కోణంలో పరిశీలించి గడువు పెంచామని తెలిపారు. గడువు పెంపును దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు, సిబ్బంది దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# అగ్రిస్టాక్ అమలులో తెలంగాణ భేష్

**మొదటిపేజీ తరువాయి**

తెలిపింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆగస్టు 31న జారీ చేసిన లేఖలో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివేదికను పరిశీలించి, నిర్దేశించిన ప్రమాణాలను పూర్తి చేసినట్లు ధ్రువీకరించింది. దీనితో స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాసి) 202627 కింద తెలంగాణకు ఈ నిధులు లభించనున్నాయి.

**అత్యంత పారదర్శకంగా పంపిణీ**

గతంలోనే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసినందుకుగాను కేంద్రం తెలంగాణకు రూ.424 కోట్ల ప్రోత్సాహకం అందించగా, తాజాగా లభించిన రూ.175 కోట్లతో కలిపి రాష్ట్రానికి భారీగా నిధులు సమకూరాయి. అగ్రిస్టాక్ ద్వారా రైతుల వివరాలు, భూమి, పంటలు, ఎరువుల పంపిణీ డిజిటల్‌గా అనుసంధానం కావడం వల్ల నిజమైన రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు ఎరువుల పక్కదారి పట్టకుండా సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల తెలిపారు.

**కేంద్ర కేటాయింపుల వివరాలు:**

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ నేడు జారీ చేసిన లేఖలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనను పరిశీలించి రాష్ట్రం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలను పూర్తి చేసిందని పేర్కొంది. దీంతో 'సాసి' 202627లో భాగంగా రూ.175 కోట్ల ప్రోత్సాహకానికి తెలంగాణ అర్హత సాధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. సాసి' పార్ట్VII (డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) విభాగంలో మొత్తం రూ.13,000 కోట్లు కేటాయించగా, అగ్రిస్టాక్ ఆధారిత ప్రాధాన్య వినియోగ సందర్భాలు కోసం రూ.10,000 కోట్లు కేటాయించారు. అందులో అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థ కోసం రూ.5,000 కోట్లు ప్రత్యేకంగా కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ డిజిటల్ వ్యవసాయంలో తెలంగాణను దేశంలోనే ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం నుంచి వరుసగా లభిస్తున్న ఈ ప్రోత్సాహకాలు నిదర్శనమని అన్నారు.

# ఇంటికో పండ్ల మొక్క.. ఆరోగ్యానికి బంగారు బాట

**మహబూబాబాద్, ఆగస్టు 31 :**

ఈరోజు నాటే చిన్న మొక్క రేపటి తరాలకు పెద్ద భరోసా అవుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఇంటి ఆవరణలో నాటుకునేందుకు పండ్ల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రామచంద్ర నాయక్, కేఆర్ నాగరాజులతో కలిసి మంత్రి సీతక్క మొక్కను నాటి వనమహోత్సవ ప్రాధాన్యతను వివరించారు. చెట్టు అంటే పచ్చదనం మాత్రమే కాదని, అది జీవం, స్వచ్ఛమైన గాలి, నీడ, ఆరోగ్యం అని ఆమె చెప్పారు. ఈ ఏడాది వనమహోత్సవంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే లక్ష్యంలో దాదాపు 91 శాతం మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, నాటిన ప్రతీ మొక్క బతకాలని, ఎదగాలని, పెద్ద చెట్టుగా మారాలని మంత్రి సీతక్క అన్నారు. అప్పుడే వనమహోత్సవం నిజమైన అర్థంలో విజయవంతమవుతుందన్నారు.

# కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి జ్వాలలు

**మొదటిపేజీ తరువాయి**

**సిఫారసుల జాబితాలపై జాప్యం**

గాంధీభవన్‌లో ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో తరచూ సమావేశాలు జరుగుతున్నా క్షేత్రస్థాయిలో నిర్ణయాల అమలుకు వచ్చేసరికి జాప్యం కొనసాగుతోంది. పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన పాత కార్యకర్తలకు 70 శాతానికి పైగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే ఉద్దేశాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పలుమార్లు వెల్లడించారు. అయితే నియోజకవర్గాల నుంచి ఆశావహుల పేర్లతో కూడిన సిఫారసు జాబితాలు సకాలంలో అందకపోవడం సమస్యగా మారిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఎవరికి పదవి ఇచ్చినా మరో వర్గం అసంతృప్తి**

చాలా నియోజకవర్గాల్లో ఒక్క పదవికి పలువురు నేతలు పోటీ పడుతున్నారు. ఎవరినైనా సిఫారసు చేస్తే మిగిలిన వర్గాలు అసంతృప్తికి గురై తమకు వ్యతిరేకంగా మారతాయనే ఆందోళన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల్లో కనిపిస్తోంది. దీంతో పేర్లను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలకు ప్రాధాన్యం లభిస్తోందని, విపక్షంలో ఉన్న సమయంలో పార్టీ కోసం పోరాడిన పాత కేడర్ నిర్లక్ష్యానికి గురవుతోందనే భావన బలపడుతోంది.

**సమన్వయ లోపంతో మరింత సమస్య**

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు, డీసీసీ అధ్యక్షులు, స్థానిక సీనియర్ నేతలు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కొరవడటం కూడా పదవుల భర్తీపై ప్రభావం చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి జిల్లాల వారీగా ఆశావహుల పేర్లు పంపే సమయంలోనూ వర్గాల మధ్య పోటీ తీవ్రంగా ఉంటోంది. దీంతో పార్టీ నాయకత్వం ముందుకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం.

**కేడర్‌లో తగ్గుతున్న ఉత్సాహం**

విపక్షంలో ఉన్న సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు, వీధిపోరాటాలు నిర్వహించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో కీలకంగా పనిచేసిన కేడర్‌కు ఇప్పటికీ తగిన గుర్తింపు రాకపోవడం ప్రభావం చూపుతోంది. గ్రామ, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, రాజకీయ ప్రత్యర్థులపై ఎదురుదాడిలో గతంలో కనిపించిన చురుకుదనం తగ్గుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పదవుల భర్తీపై ఇకనైనా స్పష్టమైన నిర్ణయం తీసుకుని కష్టపడ్డ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేడర్ కోరుతోంది. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి నామినేటెడ్ పోస్టుల భర్తీని వేగంగా పూర్తి చేయాలని, పార్టీ కోసం నిరంతరం పనిచేసిన నేతలకు సముచిత గుర్తింపు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే క్షేత్రస్థాయిలో పెరుగుతున్న నిరాసక్తత రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.

# సుస్థిర జల భద్రతకు ఉమ్మడి కార్యాచరణ

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

దేశవ్యాప్తంగా సుస్థిర జలవనరుల నిర్వహణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో ఆగస్టు 31, 2 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సులో తెలంగాణ తన సమగ్ర జలభద్రత నమూనా (యూనిఫైడ్ వాటర్ సెక్యూరిటీ మోడల్)ను దేశం ముందుంచనుందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ జాతీయ సదస్సు నేపథ్యంలో సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సదస్సులో రాష్ట్రం తరఫున సమర్పించనున్న ప్రజెంటేషన్‌లో పొందుపరచాల్సిన అంశాలు, రాష్ట్రంలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలు, గొలుసుకట్టు చెరువుల పరిరక్షణ, జలవనరుల జియోట్యాగింగ్, భూగర్భజలాల పర్యవేక్షణతోపాటు దేశవ్యాప్తంగా అనుసరించదగిన సమగ్ర జలభద్రత విధానంపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. దేశ జలభద్రతకు సంబంధించిన కీలక సవాళ్లపై కేంద్రం, రాష్ట్రాలు ఒకే వేదికపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో ఈ సదస్సుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని మంత్రి పేర్కొన్నారు. జలవనరుల సంరక్షణ నుంచి ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా వరకు వివిధ అంశాల్లోన్ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయం సాధిస్తూ నిర్దిష్ట కాలపరిమితితో కూడిన జాతీయ కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు.

# సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులు ప్రోత్సహించాలి

**హైదరాబాద్, ఆగస్టు 31 :**



సెమీ కండక్టర్ తయారీ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా జర్మనీ కంపెనీలను ప్రోత్సహించాలని జర్మన్ ఇండియన్ బిజినెస్ అలయన్స్ (జీఐబీఏ) ప్రతినిధులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రాన్ని సెమీ కండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. కెల్‌స్టర్‌బాక్ నగర మేయర్ మాన్‌ఫ్రెడ్ ఓకెల్ నేతృత్వంలో జీఐబీఏ ప్రతినిధులు సచివాలయంలో ఆయనను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ప్రెసిషిన్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్, ఆటోమేషన్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, అనుకూలతలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాల్లో పూర్తి సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జర్మనీ కంపెనీల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రెసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సామర్థ్యాలను తెలంగాణలోని టాలెంట్ పూల్, ఇండస్ట్రీ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు జర్మనీ, యూరప్ మార్కెట్లకు సులభంగా చేరేలా ప్రత్యేక లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7,8,9 తేదీల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీఐబీఏ చైర్మన్ సెల్వకుమార్ పెరియసామి, సీఈవో నిర్మల్ రామన్ కన్నయ్యన్, ఇన్నోవేషన్ హబ్ రైన్‌మెయిన్ సీఈవో స్టెఫాన్ విట్‌కిండ్ట్, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు కేకే మహేశ్వరి, శ్రీనివాస్ గరిమెళ్ల, వినోద్ కుమార్ అగర్వాల్, లోకేష్ ఫతేపురియా తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ గ్రీన్ హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

- రాష్ట్ర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం
- 'గ్రీన్' అంటే ఖరీదైనదనే భావన మారాలి
- ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వార్షికోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

తెలంగాణ నవ యువ రాష్ట్రమైనప్పటికీ అత్యంత ఉన్నతమైన ఆశయాలు, స్పష్టమైన పర్యావరణపారిశ్రామిక లక్ష్యాలతో ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 25 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రాన్ని కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాక కొరియా, జపాన్ వంటి అత్యంత అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతో పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ప్రకటించారు. తెలంగాణను ఆర్థికంగా, పారిశ్రామికంగా, సుస్థిర గ్రీన్ టెక్నాలజీలో ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు చేపడుతున్న ఈ ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు, నిపుణులు, ప్రజలందరూ భాగస్వాములై తమ వంతు సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను, పర్యావరణ అనుకూల పరిశ్రమలను ఆకర్షించడమే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక బృహత్తర గ్లోబల్ సమ్మిట్‌ను డిసెంబర్ 7, 8 9 తేదీలలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి పెట్టుబడిదారులు, పారిశ్రామిక దిగ్గజాలు, సుస్థిర నిర్మాణ రంగానికి చెందిన నిపుణులు ఈ సదస్సులో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పర్యావరణహిత నిర్మాణాలు కేవలం ఖరీదైన భవనాలు, విలాసవంతమైన అపార్టుమెంట్లకే పరిమితం కాకుండా సామాన్యుల ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, గృహ నిర్మాణాల్లోనూ భాగం కావాలని పిలుపునిచ్చారు. 'గ్రీన' అంటే ఖరీదైనదనే అపోహ మారాలని, సుస్థిర నిర్మాణాలు సమాజంలోని అందరికీ అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమలు నిర్మించామన్న దానిపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారమని, కానీ ఇకపై ఏం నిర్మిస్తున్నాం.. భవిష్యత్ తరాలపై దాని ప్రభావం ఏమిటి అనే ప్రశ్నలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



ఒక భవనం కేవలం కాంక్రీట్, ఉక్కుతో కట్టిన కట్టడం కాదు.. అది దశాబ్దాలపాటు విద్యుత్, నీటిని వినియోగిస్తూ, వ్యర్థాలను ఉత్పత్తి చేస్తూ ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తుంది అని చెప్పారు. అందువల్ల ఆర్కిటెక్ట్, ఇంజనీర్ తీసుకునే ప్రతి నిర్ణయం రాబోయే అనేక దశాబ్దాలకు పర్యావరణ నిర్ణయంగా మారుతుందన్నరు. గ్రీన్ బిల్డింగ్స్ అభివృద్ధికి అదనంగా చేర్చే ఫ్యాషన్ అంశం కాదని, మొదటి నుంచే సరైన పద్ధతిలో నిర్మించడమే దాని లక్ష్యమని స్పష్టం చేశారు. తక్కువ శీతలీకరణ అవసరమయ్యేలా భవనాలను రూపొందించడం, సహజ కాంతిని, నీటిని, విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పర్యావరణంపై, ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించవచ్చన్నారు. అత్యంత చౌక అయిన విద్యుత్ యూనిట్ అంటే మనం ఉత్పత్తి చేయాల్సిన అవసరం లేని విద్యుత్ యూనిట్ అని ఆయన అభివర్ణించారు.

**స్వచ్ఛమైన విద్యుత్ వైపు తెలంగాణ అడుగులు**

రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న నగరాలు, పరిశ్రమలు, డేటా సెంటర్ల అవసరాలకు తగినట్లుగా సౌర, పవన, హైబ్రిడ్ పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పత్తిపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు చెప్పారు. సుస్థిర మౌలిక వసతుల ప్రయోజనాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరాలని ఆకాంక్షించారు. సరిగ్గా డిజైన్ చేయని భవనం ప్రారంభంలో చౌకగా కనిపించినా, భవిష్యత్తులో అధిక విద్యుత్, నీటి బిల్లుల రూపంలో మూల్యం చెల్లించాల్సి వస్తుందని, కాబట్టి భవనం జీవితకాల నిర్వహణ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ఆదా చేయడం అంటే విద్యుత్ ఉత్పత్తి అవసరాన్ని తగ్గించడమేనని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్, సామూహిక గృహ నిర్మాణాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేయడానికి ఐజీబీసీతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. సుస్థిర నిర్మాణాలను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం, పరిశ్రమలు, ఐజీబీసీ¾, విద్యా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# ప్రతిష్ఠాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

**మొదటిపేజీ తరువాయి**

సబ్ కమిటీ సభ్యులు, ఐటీపరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్ రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. దీని ద్వారా రోజువారీగా ఏర్పాట్ల పురోగతిని పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. సమ్మిట్ నిర్వహణకు అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్, ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్, మీడియాకాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎంఓయూ కమిటీ తదితర కమిటీలు ఏర్పాటు చేసి సీనియర్ ఐఏఎస్‌లకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. సమ్మిట్ 2026కు ప్రత్యేకమైన లోగోను రూపొందించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసి వాటితో సమావేశాలు నిర్వహించి సమ్మిట్ కార్యాచరణపై చర్చించాలని తెలిపారు.

**దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం**

సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని దిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమ్మిట్‌పై ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేసి సమ్మిట్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి అవకాశాలను ప్రచారంలో ప్రధానంగా ప్రదర్శించాలని తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొందించి తనకు అందజేయాలని ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ సమ్మిట్ 2026ను నిర్వహించాలని, ఇందుకోసం అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటీ సీఎండి శశాంక, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# అంబర్‌పేట అభివృద్ధికి ఎంతో చేస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

ఫ్యూర్, రేర్ అని విభజించామని చెప్పారు. మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని సోమవారం ప్రారంభించిన అనంతరం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అంబర్‌పేట నియోజకవర్గం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటోందని, ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు లేవు.. మూసీ మురికి ఒక వైపు, వరదలు మరో వైపు అంబర్‌పేటను ఇబ్బందిపెడుతున్నాయని, చిన్న వర్షం వచ్చినా మూసారాంబాగ్ బ్రిడ్జిపై వరద వచ్చేదని, అనేకమంది ప్రాణాలు పోయాయని చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్న వాళ్లు ఎందుకు బ్రిడ్జి కట్టలేదు అని ప్రశ్నించారు. తాము రెండేళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించుకున్నామని చెప్పారు. ప్రతి పేదవాడికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పారు.. పదేళ్లలో అంబర్‌పేటలో ఇళ్లు కట్టించి ఇచ్చారా అంటూ తాము పదెకరాల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామన్నారు. ఏ నాయకుడు వస్తే హెలికాప్టర్‌లో పూలు చల్లి బతుకమ్మ కుంటను చెరపట్టింది ఎవరో అందరికీ తెలుసునని, బతుకమ్మ కుంటను పునరుద్ధరించామని, ఎండాకాలంలో కూడా నీళ్లు ఊరాయని, బతుకమ్మ కుంటకు వచ్చి విమలక్క పాటలు పాడిందని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్రమంతా తిరిగినప్పుడు ప్రతి ఒక్కరు ఆశీర్వదిస్తే ఇందిరమ్మ రాజ్యం ఏర్పడింది.. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్నాం.. ఈ వెయ్యి రోజుల పాలనపై మేం కార్యాచరణ తీసుకున్నాం.. నిరసన తెలుపుతామని కొందరు బయలుదేరారు.. పదేళ్లు తెలంగాణను నడిపించిన వాళ్లు, కబళించిన వాళ్లు ఇప్పుడు నిరసనలు తెలుపుతామంటున్నారు అంటూ విమర్శించారు. 2023 డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసి సెక్రటేరియట్‌కు వెళ్లి సమీక్ష చేస్తే 11 లక్షల మంది ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని చెప్పారు.. ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందని చెప్పారు.. రూ.16 వేల కోట్ల మిగులుతో కాంగ్రెస్ పార్టీ కేసీఆర్‌కు తెలంగాణను అప్పగించింది.. ఏడాదికి రూ.6,500 కోట్లు వడ్డీ కింద చెల్లిస్తే సరిపోయేది.. తొమ్మిదిన్నరేళ్లలో ఒకే ఒక కుటుంబం రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పుల్లో తెలంగాణను నిండా ముంచింది.. జీతాలు, పింఛన్లు ఇవ్వలేని స్థితికి తీసుకువచ్చింది అని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సమస్యలను తాను



అర్థం చేసుకుంటా.. 32 నెలల్లో ఎప్పుడైనా 1వ తేదీన జీతాలు ఇవ్వకుండా ఆపామా.. ఉద్యోగులు ఆలోచించాలి.. తుఫాన్ వచ్చినా, కరువు వచ్చినా ఒకటో తేదీనే జీతాలు వేశాం.. ఏ బ్యాంకులు నమ్మడం లేదని ఉద్యోగులు తన దగ్గరకు వచ్చారు.. ఆనాడు ఎలా ఉంది.. ఈనాడు ఎలా ఉందో ఉద్యోగులు ఆలోచించాలి అని విజ్ఞప్తి చేశారు. ఐదున్నర లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలలకోకసారి జీతాలు ఇచ్చేవాళ్లం.. కానీ ఇపుడు 5నే జీతాలు ఇస్తున్నామన్నారు. 61 ఏళ్లకు ఉద్యోగ వయోపరిమితి పెంచడంతో రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.8 వేల కోట్ల బకాయిలు కేసీఆర్ పెట్టిపోయాడు.. రెండు నెలల్లో రూ.6 వేల కోట్ల రిటైర్మెంట్ బకాయిలు విడుదల చేశాం అని చెప్పారు. ఉద్యోగులు, వాళ్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామన్నారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే 60 మంది చనిపోతే కనీసం కన్నీరు కార్చలేదు.. ఆర్టీసీ కార్మిక గౌరవ అధ్యక్షుడిగా ఉన్న హరీష్ రావు బయటకు రాలేదు.. ఆడబిడ్డలకు తాము ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం.. 32 నెలల్లో రూ.11 వేల కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించింది.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. అని ఆయా పథకాల గురించి సీఎం వివరించారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు తీసుకెళ్తున్నానన్నారు. 25 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పెడుతున్నామని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో నో అడ్మిషన్ బోర్డులు పెట్టే పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వ స్కూళ్లలో లక్ష అడ్మిషన్లు పెరిగాయని, 28వ స్థానంలో ఉన్న తెలంగాణను 18వ స్థానానికి తీసుకువచ్చామని తెలిపారు. పదేళ్లలో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 నియామకాలు చేపట్టలేదు..టిఫికేషన్లు ఇవ్వాలి, ప్రశ్నాపత్రాలు ముద్రించి లీక్ చేయాలి.. ఇదే గత ప్రభుత్వ విధానం.. తమ వెయ్యి రోజుల పాలనలో 72 వేల ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నాం.. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేశాం.. రూ.1.70 లక్షల కోట్లను రైతుల కోసం ఖర్చు చేశాం.. కేసీఆర్ వరి వేసుకుంటే ఉరేనని అన్నాడు.. రూ.20,617 కోట్లను రైతు రుణమాఫీ చేశాం.. రూ.30 వేల కోట్లలను ఉచిత రైతు విద్యుత్ కోసం ఖర్చు చేశాం అని చెప్పారు. తెలంగాణలో అప్పులు లేని రైతులు ఉన్నారని నీతి ఆయోగ్ చెప్పిందన్నారు. కోహెడలో అంతర్జాతీయస్థాయి కొత్త పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నామని, కేసీఆర్ ఇచ్చిన బతుకమ్మ చీర కట్టుకుని మహిళలు ఏనాడైనా బయటకు వచ్చారా అంటూ కమీషన్లకు కక్కుర్తిపడి ఆడబిడ్డలకు నాసిరకం చీరలు ఇచ్చారని ఆరోపించారు. తాము కోటిమంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు ఇచ్చామని, ఆడబిడ్డలు తనను ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. రూ.2,100 కోట్ల మహిళా సంఘాలకు వడ్డీ కింద బ్యాంకులకు చెల్లించాం..మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు కొనిచ్చి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చేలా చేశామని, బస్సులకు యజమానులుగా ఆడబిడ్డలను చేశానని తెలిపారు. ఆడబిడ్డలకు ప్రభుత్వ భూములు ఇచ్చి పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయిస్తున్నాం.. హైటెక్ సిటీ పక్కన మహిళా సంఘాలకు రూ.1,000 కోట్ల విలువైన మూడున్నరెకరాల్లో వాళ్ల ఉత్పత్తుల విక్రయాల కోసం ఇందిరా మహిళా శక్తి స్టాల్స్ ఏర్పాటు చేశాం.. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను అమెజాన్‌లో అమ్ముతున్నారు అని సీఎం రేవంత్ వివరించారు.

**ప్రభుత్వసేవలు పొందండి**

అడిగిన వాళ్లందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామని, 15 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని, 3 కోట్ల 48లక్షల మందికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తున్నామంటూ వీరిలో బీఆరఎస్ వాళ్లు కూడా ఉన్నారన్నారు. సన్న బియ్యం తింటూ విమర్శలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ ఏనాడైనా ఆలోచించాడా అని ప్రశ్నించారు. ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం.. హైదరాబాద్‌లో పేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లు కడుతున్నాం.. ప్రజా పాలన అంటే ఇది కదా అన్నారు. వెయ్యి ఎకరాల్లో కేసీఆర్, వంద ఎకరాల్లో కేటీఆర్, జన్వాడలో 50 ఎకరాల్లో కవిత ఫామ్‌హౌస్ కట్టుకున్నారని తెలిపారు. శ్రీకాంత్ చారి తల్లి శంకరమ్మను అనాథలా రోడ్డుమీద పడేస్తే మహిళా కమిషన్ సభ్యురాలిగా చేశానన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ పేరు మహిళా యూనివర్సిటీకి పెట్టాను.. వెయ్యి రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించానని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి ఏడాదిపాటు విధులకు రాకపోతే డిస్మిస్ చేస్తారు.. మరి అసెంబ్లీకి ఒక్క రోజు కూడా రాని కేసీఆర్‌ను ఏం చేయాలి అని ప్రశ్నించారు.7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో వాళ్ల ఎదురుగానే అన్ని విషయాలు చెప్తా.. తెలంగాణకు న్యాయం చేయాలని అనుకుంటే, నమ్మకం ఉంటే అసెంబ్లీకి కేసీఆర్ రావాలి.. పదేళ్లలో కేసీఆర్ ఏం చేశాడో, వెయ్యి రోజుల్లో నేను ఏం చేశానో అసెంబ్లీలో చర్చకు సిద్ధం అన్నారు. రేపటి నుంచి ఆరు రోజులపాటు ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**వరంగల్, ఆగస్టు 31 :**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపా ప్రతి భూయజమానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్కతో కలిసి మహబూబాబాద్ ఐడీఓసీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని రెవెన్యూ, భూ రీసర్వే, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను లక్ష్యంగా ఎంపిక చేసి మొదటి విడత భూ సర్వేను నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత సర్వేను వచ్చే ఏడాది మార్చి నాటికి చేపట్టి రాబోయే ఏడాదిన్నరలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని వ్యవసాయ, వ్యవసాయేతర, ఆబాదీ ఆస్తుల వారీగా శాస్త్రీయంగా సర్వే చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 31 నాన్‌కెడస్ట్రల్ గ్రామాలకు గాను 18 గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో ఐదు గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరో 13 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన 13 గ్రామాల్లో, భూపాలపల్లి జిల్లాలో 8, జనగామ జిల్లాలో 5 గ్రామాల్లో సర్వే పనులను తక్షణమే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. అదేవిధం గా నక్షా ఉన్న 70 కెడస్ట్రల్ గ్రామాలను నోటిపై చేయగా, 40 గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయని, ఏడు గ్రామాల్లో సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు. ఆరు జిల్లాల పరిధిలో ఇప్పటివరకు మొత్తం 12 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, 53 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వేలో లైసెన్సడ్ సర్వేయర్లు తప్పనిసరిగా పాల్గొనాలని మంత్రి స్పష్టం చేశారు. రీసర్వే విధులకు హాజరుకాకుండా ప్రైవేట్ సర్వేలకు మాత్రమే పరిమితమయ్యే సర్వేయర్లకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండా సర్టిఫికెట్లు జారీ చేయడం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. సర్వే పనులకు అవసరమైన



శిక్షణ పొందిన సిబ్బందిని తగిన సంఖ్యలో సిద్ధం చేయాలని, ప్రత్యామ్నాయ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని కలెక్టర్లు, అదనపు కలెక్టర్లను ఆదేశించారు. సర్వే పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి జిల్లాలో 22ఏ కింద ఉన్న భూములు ఏవి, వాటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు ఎంత, ఇతర వివరాలు ఏమిటి అనే అంశాలను నాలుగు కాలమ్స్‌తో కూడిన సమగ్ర నివేదికగా సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సర్వే నంబర్ల వారీగా పూర్తి వివరాలను రెండు రోజుల్లో అధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు. 22ఏ జాబితాలో పొరపాటున చేరిన రైతుల భూముల వివరాలను పరిశీలించి, అర్హత ఉన్న భూములను జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనామాలు తదితర సమస్యలను సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న ప్రతి రైతుకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా సమావేశమై, శాస్త్రీయ పద్ధతుల్లో భూముల కొలతలు చేపట్టి సరిహద్దులను నిర్ధారించాలని సూచించారు. గతంలో పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు బోర్లు, విద్యుత్ కనెక్షన్లు తదితర సౌకర్యాలు పొందే సమయంలో ఎలాంటి ఇబ్బందులు, వేధింపులు ఎదుర్కోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ పురోగతిపై కూడా మంత్రి సమీక్షించారు. జూలై 7న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నర్సంపేట, పరకాల, ములుగు, జనగామ, భూపాలపల్లి ప్రాంతాల్లో ఐదు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, వరంగల్‌లో ఒక డీఐజీ కార్యాలయం మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

హనుమకొండ జిల్లా పల్లివేల్పులలో డీఐజీ కార్యాలయం కోసం 20 గుంటలు/ఒక ఎకరం ఎసఆరఎస్‌పీ స్థలాన్ని కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎనిమిది కార్యాలయాలు ప్రస్తుతం ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. పరకాలలో నూతన భవన నిర్మాణం 70 శాతం పూర్తయిందని తెలిపారు. భీమదేవరపల్లి, పరకాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు హౌసింగ్ శాఖకు అప్పగించాలని నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, రెండో విడత ఇళ్ల మంజూరు, ఉచిత ఇసుక సరఫరా, లబ్ధిదారుల ఎంపికపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో నిర్మాణాలు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లాలో 4,600 ఇళ్లు మంజూరు కాగా, 3,946 ఇళ్లకు ప్రాసెస్ పూర్తయినప్పటికీ ఇప్పటివరకు 854 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ములుగు జిల్లాలో కూడా ఇళ్ల పూర్తిశాతం 50 శాతానికి లోపే ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ఆగస్టు 315 నాటికి గరిష్ఠ సంఖ్యలో ఇళ్లను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు.

రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అదేవిధంగా రేకులు లేదా ఇతర తాత్కాలిక పైకప్పులతో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకం కింద పాత పైకప్పును తొలగించి ఆర్‌సీసీ స్లాబ్ నిర్మించుకునేందుకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక అందించేందుకు 'మన ఇసుక వాహనం' పోర్టల్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ కొంతమంది ప్రైవేట్ ట్రాక్టర్ కాంట్రాక్టర్లు, మధ్యవర్తులు అదనపు రవాణా చార్జీల పేరుతో లబ్ధిదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు సమీక్షలో వెల్లడైంది. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఇసుక క్వారీల నుంచి ఒక ట్రాక్టర్ ఇసుకకు రూ.5,000 వరకు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. రవాణా రేట్లను శాస్త్రీయంగా నిర్ణయించి, వాటిని సిస్టమ్‌లో ఆన్‌బోర్డ్ చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఇళ్ల మంజూరులో లబ్ధిదారుల నుండి డబ్బులు తీసుకుంటే సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు చట్టబద్ధమైన హక్కులు కల్పిస్తూ, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడం, పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. భూ సర్వే, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతి, అక్రమాలు, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు పోరిక బలరామ్ నాయక్, డాక్టర్ కడియం కావ్య, ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, కడియం శ్రీహరి, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, నాయని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖల కార్యదర్శులు లోకేష్ కుమార్, రాజీవ్ గాంధీ హనుమంతు, వి.పి.గౌతమ్, జిల్లా కలెక్టర్లు స్నేహ శబరీష్, చాహత్ బాజ్‌పాయ్, సత్యశారద, సందీప్ కుమార్ ఝా, హేమంత్ బొర్కడే సహదేవరావు, రాహుల్ శర్మ, అటవీ శాఖ అధికారులు పి.లావణ్య, జి.ముకుందరెడ్డి, బి. నికిత, వికాస్ మీనా, జి.కిష్టాగౌడ్, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'
# దిశగా అడుగులు

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఇటీవల బ్రిటన్, అమెరికా దేశాల్లో చేపట్టిన సుదీర్ఘ పర్యటన విజయవంతమైంది. ఈ విదేశీ పర్యటనలో సాధించిన చరిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహనా ఒప్పందాలు, లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ల సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోమవారం అందజేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో ఇప్పటికే ప్రపంచ పటంలో ప్రత్యేక ముద్ర వేసిన హైదరాబాద్ నగరాన్ని ఇప్పుడు అంతర్జాతీయ విద్యా, నైపుణ్య రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. కమిటీ నివేదిక ప్రకారం అమెరికాలోని అత్యుత్తమ 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ'తోపాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపింది. ముఖ్యంగా నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తన క్యాంపస్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తోంది. దీనికితోడు ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచే హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్‌రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. ఈ అంతర్జాతీయ కోర్సులు రాబోయే నవంబర్ నుంచే నగరంలో ప్రత్యక్షంగా ప్రారంభం కానున్నాయి. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎలఎసఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎసఓఎస్), ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ), లండన్ బిజినెస్ స్కూల్, వర్జీనియా టెక్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో విస్తృతస్థాయి చర్చలు జరిపింది.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలించనున్నాయి. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. కమిటీ నివేదికను స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం ఊపిరి పోసిందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర విద్యార్థులకు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ప్రకటిస్తూ అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కేంద్రం (గ్లోబల్ నాలెడ్జ్ హబ్) ఏర్పాటైతే మరిన్ని ప్రపంచ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) తెలంగాణకు తరలివస్తాయని వెల్లడించారు. దీనివల్ల మన యువతకు విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు తయారీ, పరిశోధన రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని తెలిపారు. డాక్టర్ ఎంసీఆర్ హెచఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు ఈ నాలెడ్జ్ హబ్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతం చేశామని వివరించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట'లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడా రంగ అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని(ట్రాక్) నిర్వహించనున్నట్లు

## 'టవర్స్'తో నెరవేరుతున్న
# సొంతింటి కల

**హైదరాబాద్, ఆగస్టు 31 :**

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న అల్పాదాయ వర్గాల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌లో 7,340 మందికి ఇండ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి అయ్యింది. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు రోజులపాటు నిర్వహించిన లాటరీ ప్రక్రియ సోమవారం ముగిసింది. రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగస్టు 28న లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు ప్రక్రియను ప్రారంభించిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ నియోజకవర్గంలో మినహాయించి మిగిలిన 15 నియోజకవర్గాల్లో 480 ఇండ్ల చొప్పున కేటాయించారు. కంటోన్మెంట్ పరిధిలో తొలి విడతలో 140 ఇండ్లను మాత్రమే నిర్మిస్తున్నందున ఆ సంఖ్యలోనే ఇండ్లను కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న వారికే ఇండ్లు కేటాయించాలన్న ఉద్దేశంతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టి హౌసింగ్ బోర్డు ద్వారా దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. ఇలా అందుబాటులో ఉన్న స్థలాల్లో ప్రతిపాదించిన మొత్తం 7,340 ఇండ్లకు 60,720మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరిశీలనలో అర్హులైన వారి పేర్లతో పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, బహిరంగంగా లాటరీ నిర్వహించి ఇండ్లను కేటాయించారు. లాటరీ ప్రక్రియపై దరఖాస్తుదారుల్లో సంతృప్తి వ్యక్తం కాగా లాటరీ ద్వారా ఇండ్లు పొందిన కుటుంబాల్లో పండగ సీజన్ మరింత సంతోషాలు నింపింది. ఔటర్ పరిధిలో మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 16 నియోజకవర్గాల్లో ఇండ్ల కేటాయింపు పూర్తి కాగా, 4 నియోజకవర్గాల్లో ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన నోటిఫికేషన్ కూడా త్వరలోనే వెలువడనున్నది.

**ఆన్ లైన్‌లో వివరాలు..**

**అభ్యంతరాల స్వీకరణ**

లాటరీ ద్వారా ఇండ్లు పొందిన వారి వివరాలన్నిటినీ tghb.telangana.gov.inలో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నామని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఇలా ఎంపికైన ప్రజలు తమ అభ్యంతరాలను తెలియచేసే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ అభ్యంతరాలను కూడా వెబ్ సైట్ ద్వారా సమర్పించవచ్చన్నారు. లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించడానికి అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలనను చేపడుతుందని వెల్లడించారు. ఇండ్లు వచ్చిన వారు తమ ఇండ్లకు వచ్చే అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

**త్వరలో మరిన్ని ప్రాజెక్టులు**

తొలి విడతలో దరఖాస్తు చేసుకుని లాటరీలో ఎంపిక కాని వారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని గౌతం తెలిపారు. ఇది ప్రారంభం మాత్రమే. అర్హులైన అల్పాదాయ కుటుంబాలకు సొంతింటిని అందించే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. రాబోయే ప్రాజెక్టుల్లో మరిన్ని కుటుంబాలకు అవకాశం లభిస్తుంది అని తెలిపారు.




# ఫీచర్ ఫోన్లకూ యూపీఐ చెల్లింపులు..

- ‘యూపీఐ 123పే’ సేవలు ప్రారంభించిన ఫోన్‌పే
- ఇంటర్నెట్ లేకుండానే డిజిటల్ చెల్లింపులు
- 2జీ నెట్‌వర్క్‌లోనూ పనిచేసేలా సేవలు
- 20 కోట్ల మంది ఫీచర్ ఫోన్ వినియోగదారులకు ప్రయోజనం
- 12 భారతీయ భాషల్లో ఏఐ వాయిస్ అసిస్టెంట్
- క్యూఆర్ స్కాన్‌తోనూ చెల్లింపులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:**

స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సౌకర్యం పరిమితంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలకు డిజిటల్ చెల్లింపులను చేరువ చేసేందుకు ఫోన్‌పే ‘యూపీఐ 123పే’ సేవలను సోమవారం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న 20 కోట్లకు పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే యూపీఐ చెల్లింపులు చేసుకునేలా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సాధారణ 2జీ నెట్‌వర్క్‌లోనూ పనిచేసేలా ఎస్సెమ్మెస్ సాంకేతికతతో ఈ సేవలను రూపొందించారు.

**ఫీచర్ ఫోన్లలోనే యూపీఐ**

మొబైల్ నంబర్ లేదా యూపీఐ ఐడీ ద్వారా ఇతరులకు డబ్బులు పంపే సౌకర్యం ఈ సేవల్లో ఉంది. కెమెరా ఉన్న ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వ్యాపారులకు చెల్లింపులు చేయవచ్చు. బ్యాంకు ఖాతా బ్యాలెన్స్, లావాదేవీల వివరాలను కూడా తెలుసుకునే అవకాశం ఉంది. త్వరలో మొబైల్ రీఛార్జ్, బిల్లుల చెల్లింపుల సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఫోన్‌పే తెలిపింది.

**ఏఐ వాయిస్ అసిస్టెంట్**

యూపీఐ సేవలను సులభంగా యాక్టివేట్ చేసుకునేందుకు ఫోన్‌పే ప్రత్యేక ఏఐ ఆధారిత వాయిస్ అసిస్టెంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లీష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో ఈ సహాయక సేవ పనిచేస్తుంది. ఫీచర్ ఫోన్ వినియోగదారులకు యూపీఐ సేవల వినియోగంలో ఇది మార్గనిర్దేశం చేయనుంది.

**సులభంగా ఖాతా యాక్టివేషన్**

ఫీచర్ ఫోన్‌లో ఫోన్‌పే యాప్‌ను తెరిచి నిబంధనలను అంగీకరించిన తర్వాత బ్యాంకును ఎంచుకోవాలి. అనంతరం డెబిట్ కార్డు చివరి ఆరు అంకెలు, గడువు తేదీ నమోదు చేసి యూపీఐ పిన్ సెట్ చేసుకోవాలి. దీంతో ఖాతా యాక్టివేట్ అవుతుంది.

**సెకన్లలో లావాదేవీ పూర్తి**

చెల్లింపుల సమయంలో ‘పే టు మొబైల్’ లేదా ‘పే టు యూపీఐ ఐడీ’ ఆప్షన్‌ను ఎంచుకుని వివరాలు, మొత్తాన్ని నమోదు చేసి యూపీఐ పిన్ నమోదు చేస్తే లావాదేవీ పూర్తవుతుంది. కెమెరా ఉన్న ఫీచర్ ఫోన్లలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా చెల్లింపులు చేయవచ్చు.

# నోయిడాలో మరో నిర్భయ ఘటన

- కదులుతున్న బస్సులో బాలికపై సామూహిక అత్యాచారం
- 16 ఏళ్ల బాలికపై ఇద్దరి దారుణం

**నోయిడా, ఆగస్టు 31:**

గ్రేటర్ నోయిడాలో 16 ఏళ్ల బాలికపై కదులుతున్న బస్సులో సామూహిక అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఆగస్టు 4న జరిగిన ఈ ఘటనలో బస్సు డ్రైవర్ కుల్దీప్ (39), కండక్టర్ సందీప్ (26)ను పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర ఢిల్లీలోని తిమార్‌పూర్ ప్రాంతంలోని పార్కింగ్ స్థలం నుంచి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

**బంధువుల ఇంటికి వెళ్తుండగా..**

ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురికి చెందిన బాలిక కుటుంబ సభ్యులకు చెప్పకుండా నోయిడాలోని బంధువుల ఇంటికి బయలుదేరింది. భారీ వర్షం, చీకటి సమయంలో పరిచౌక్ వద్ద దిగిన ఆమె.. బంధువుల ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం ఎదురుచూస్తోంది. అప్పటికే రాత్రి 9 గంటలు దాటింది.

**బస్సులోకి ఎక్కిన బాలిక**

అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ స్లీపర్ బస్సును బాలిక ఎక్కింది. తాము కూడా నోయిడా సెక్టార్63 వైపు వెళ్తున్నామని కండక్టర్ చెప్పడంతో ఆమె బస్సులోకి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆ బస్సు వాస్తవానికి సూరజ్‌పూర్‌లోని వర్క్‌షాప్ నుంచి తిరిగి వస్తోంది. బస్సు కదిలిన కొద్దిసేపటికే నిందితులు బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ప్రతిఘటిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించినట్లు పోలీసులు వెల్లడించారు.

**ఢిల్లీలో వదిలివేత**

లైంగిక దాడి అనంతరం బాలికను ఢిల్లీలోని కశ్మీర్ గేట్ సమీపంలోని రింగ్ రోడ్ వద్ద వదిలేసి నిందితులు పరారైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**బస్సులో కీలక ఆధారాలు**

దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్సును స్వాధీనం చేసుకున్నారు. బస్సులోని స్లీపర్ బెర్త్‌లకు ఉన్న కర్టెన్లను నిందితులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందం బస్సులో బాలికకు సంబంధించిన ఆధారాలను సేకరించింది.

**సీసీటీవీ ఫుటేజీల పరిశీలన**

నిందితులు ఇద్దరూ విశ్వనాథ్ ట్రావెల్స్ అనే ప్రైవేట్ సంస్థలో రెండేళ్లకు పైగా పనిచేస్తున్నట్లు సమాచారం. వారిని అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బస్సు ప్రయాణించిన మార్గంలోని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి పరిశీలిస్తున్నారు. తాజా ఘటన 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటనను మరోసారి గుర్తుచేస్తోంది.

# పెజెష్కియాన్‌తో మోడీ కీలక భేటీ..

- ఉద్రిక్తతల వేళ భారత్-ఇరాన్ సంబంధాలపై చర్చ

**బిష్కెక్, ఆగస్టు 31:**

షాంఘై సహకార సంస్థ సదస్సు కోసం కిర్గిజిస్థాన్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ.. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. రాజధాని బిష్కెక్‌లో జరిగిన ఈ భేటీలో భారత్‌ఇరాన్ సంబంధాల తాజా పరిస్థితిపై ఇరువురు నేతలు సమీక్షించారు. పరస్పర ప్రయోజనం ఉన్న రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసి విస్తరించాల్సిన అవసరంపై చర్చించారు.

**యుద్ధం తర్వాత తొలిసారి భేటీ**

ఫిబ్రవరిలో ఇరాన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత మోడీ, పెజెష్కియాన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ఇదే తొలిసారి. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చితో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**ఉద్రిక్త పరిస్థితుల్లో కీలక భేటీ**

అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో మోడీపెజెష్కియాన్ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తంగా ఉన్న సమయంలో ఇరువురు నేతలు భేటీ అయ్యారు. ఇరాన్ భారత్‌కు టాప్ 10 వాణిజ్య భాగస్వాముల్లో ఒకటిగా ఉన్నప్పటికీ.. హోర్ముజ్ జలసంధి మూసివేత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయి.

**ఫోన్‌లోనూ చర్చలు**

అంతకుముందు మార్చి 21న మోడీ, పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. జూన్‌లోనూ ఇరువురు నేతలు మరోసారి ఫోన్‌లో సంభాషించారు. ఆ సమయంలో మధ్యప్రాచ్య పరిణామాలను పెజెష్కియాన్ మోడీకి వివరించారు. ఘర్షణను ముగించేందుకు కుదిరిన అవగాహనను మోడీ స్వాగతిస్తూ.. శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం నిరంతర ప్రయత్నాలు అవసరమని స్పష్టం చేశారు.

# యుద్ధానికి ముగింపు పలకాలి..

**బిష్కెక్, ఆగస్టు 31:**

రష్యాఉక్రెయిన్ యుద్ధంపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. యుద్ధానికి ముగింపు పలికేందుకు అన్ని శాంతియుత ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. అంతులేని యుద్ధ పరిస్థితి నుంచి ఘర్షణ ముగిసే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలన్నదే మానవాళి ఆకాంక్ష అని పేర్కొన్నారు.

**పుతిన్‌తో మోడీ భేటీ**

కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోడీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఉక్రెయిన్ సంక్షోభంపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సమస్యపై భారత్ రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని మోడీ తెలిపారు.

**శాంతియుత పరిష్కారానికే ప్రాధాన్యం**

ఉక్రెయిన్ సంక్షోభానికి పరిష్కారం కోసం అన్ని శాంతియుత మార్గాలకు భారత్ మద్దతు ఇస్తోందని మోడీ స్పష్టం చేశారు. సమస్యలను దౌత్యం, చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికే భారత్ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ప్రతిరోజూ కొనసాగుతున్న యుద్ధం మానవాళిని వెనక్కి నెడుతుందని, ఘర్షణలకు ముగింపు పలికేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**‘ఇది యుద్ధ సమయం కాదు’**

2022లో పుతిన్‌తో జరిగిన సమావేశంలో మోడీ చేసిన ‘ఇది యుద్ధ సమయం కాదు’ వ్యాఖ్యను తాజా ప్రకటన మరోసారి గుర్తుచేసింది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో పాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో జరిగిన చర్చల్లోనూ భారత్ ఇదే వైఖరిని వ్యక్తం చేస్తూ వచ్చింది. ఇరు దేశాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ పదేపదే సూచించింది.

**శాంతి మార్గానికే భారత్ మద్దతు**

భారత్ శాశ్వత శాంతికి మద్దతుదారుగా ఉంటుందని మోడీ తెలిపారు. మానవాళికి ముప్పుగా మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశాలన్నీ కలిసి పనిచేయాల్సిన సమయం ఇదేనని పేర్కొన్నారు. గాంధీ, బుద్ధుల భూమిగా భారత్ శాంతి మార్గాన్నే విశ్వసిస్తుందని స్పష్టం చేశారు.

**త్వరలో భారత్‌కు పుతిన్**

వచ్చే వారం న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బిష్కెక్‌లో మోడీపుతిన్ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.



భారత్‌రష్యా సంబంధాలతో పాటు ఉక్రెయిన్ యుద్ధం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతల మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది.

# సెప్టెంబర్ 5న సీజేపీ నిరసన మార్చ్..

- అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ
- ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ వరకు మార్చ్
- నిరసనపై కోర్టు జోక్యం అవసరం లేదన్న ధర్మాసనం
- శాంతియుతంగా వ్యవహరించాలని సూచన
- హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని ఆదేశం
- అవాంఛనీయ ఘటనలపై మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:**

సెప్టెంబర్ 5న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంలో కోర్టు జోక్యం చేసుకోవాల్సినంత బలమైన



కారణాలు కనిపించడం లేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

**శాంతిభద్రతల అంశమని స్పష్టీకరణ**

సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతి భద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

**పోలీసుల పరిహారంపై పిటిషన్**

రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సోమవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ వద్ద జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని పిటిషన్‌లో కోరారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని, పార్లమెంట్ సహా కీలక ప్రభుత్వ సంస్థల సమీపంలో నిరసనలకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

**హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలి**

నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. ప్రతి అంశాన్ని కోర్టు పరిశీలించలేదని స్పష్టం చేస్తూ, ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ ‘తటస్థ అంపైర్’గా అభివర్ణించారు.

**బ్రిక్స్ సదస్సుపై భద్రతా ఆందోళనలు**

ఆగస్టు 312, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది రిజ్వాన్ అహ్మద్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నందున నిరసన మార్చ్‌ను సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని కోరారు. అయితే ఈ అంశాలపై నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలని సీజేఐ స్పష్టం చేశారు.

**అవాంఛనీయ ఘటనలైతే మళ్లీ కోర్టుకు**

నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ ఈ మార్చ్ చేపడుతోంది.

# సోఫియా ఖురేషీపై వ్యాఖ్యలు..

- మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ
- క్షమాపణను తిరస్కరించిన అత్యున్నత న్యాయస్థానం
- గవర్నర్ నిర్ణయం వరకు వేచి ఉండాలని ఆదేశం
- ప్రాసిక్యూషన్ అనుమతిపై ఉత్కంఠ
- SIT దర్యాప్తు పూర్తి.. సీల్డ్ కవర్‌లో నివేదిక
- అనుమతి వస్తే ఛార్జ్‌షీట్.. లేకుంటే క్లోజర్ రిపోర్ట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 31:**

కల్నల్ సోఫియా ఖురేషీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన సమర్పించిన క్షమాపణను సోమవారం



అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసులో తదుపరి చర్యలు చేపట్టే ముందు మంత్రిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై మధ్యప్రదేశ్ గవర్నర్ నిర్ణయం కోసం వేచి చూడాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

**అనుచిత వ్యాఖ్యలపై కేసు**

గతేడాది ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైన్యానికి చెందిన కల్నల్ సోఫియా ఖురేషీపై విజయ్ షా అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఆమెను ‘ఉగ్రవాదుల సోదరి’గా అభివర్ణించడంతో పాటు, ఉగ్రవాదుల మతానికి చెందిన ఆమెనే శత్రువులపైకి ప్రధాని మోడీ పంపించారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి ప్రాసిక్యూషన్ చేపట్టే అంశం సుప్రీంకోర్టు పరిధికి చేరింది.

**గవర్నర్ నిర్ణయం కీలకం**

ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సోమవారం కేసును విచారించింది. మంత్రిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై మధ్యప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని కోర్టు గతంలోనే కోరింది. ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నటరాజ్ వాదనలు వినిపిస్తూ.. గవర్నర్ ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

**క్షమాపణను పరిగణనలోకి తీసుకోవాలన్న విజ్ఞప్తి**

విజయ్ షా తరఫున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్ వాదిస్తూ.. మంత్రి ఇప్పటికే తన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసి క్షమాపణ చెప్పారని, దాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతిపై నిర్ణయం తీసుకునే వరకు వేచి చూడాలని జస్టిస్ బాగ్చీ సూచించారు.

**SIT దర్యాప్తు పూర్తి**

ఈ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తును ఇప్పటికే పూర్తి చేసి నివేదికను సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు సమర్పించిందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. గవర్నర్ నిర్ణయం తర్వాత తీసుకునే తదుపరి చర్యలపై ధర్మాసనం వివరాలు కోరింది.

**అనుమతిపై తదుపరి చర్యలు**

ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇస్తే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తారా? అని సీజేఐ ప్రశ్నించారు. అనుమతి లభిస్తే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని ఏఎస్జీ నటరాజ్ తెలిపారు. ఒకవేళ అనుమతి నిరాకరిస్తే క్లోజర్ రిపోర్ట్ దాఖలు చేస్తామని వెల్లడించారు. దీంతో గవర్నర్ నిర్ణయం వెలువడే వరకు వేచి ఉండాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.

# ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు..

- మధ్యలోనే ఎమర్జెన్సీ ల్యాండింగ్
- దమ్మం–ఢిల్లీ విమానానికి బెదిరింపు
- టిష్యూ పేపర్‌పై ‘బాంబు’ అని రాత
- అహ్మదాబాద్‌లో విమానం ల్యాండింగ్
- 32 మంది ప్రయాణికులు సురక్షితం
- విమానంలో విస్తృతంగా తనిఖీలు

**అహ్మదాబాద్, ఆగస్టు 31:**

సౌదీ అరేబియాలోని దమ్మం నుంచి న్యూఢిల్లీకి




బయలుదేరిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో సోమవారం అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానం గాల్లో ఉండగా బాత్రూమ్‌లోని టిష్యూ పేపర్‌పై ‘బాంబు’ అని రాసి ఉండటాన్ని క్యాబిన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే పైలట్లకు సమాచారం అందించడంతో విమానాన్ని అహ్మదాబాద్‌కు మళ్లించారు.

**సురక్షితంగా ల్యాండింగ్**

సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో విమానం అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. అనంతరం విమానంలోని 32 మంది ప్రయాణికులను టెర్మినల్ 2కు తరలించారు.

**విస్తృతంగా తనిఖీలు**

విమానం ల్యాండ్ అయిన వెంటనే అహ్మదాబాద్ పోలీసులు, భద్రతా దళాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. విమానంలో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. యాదవ్ తెలిపారు. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని వెల్లడించారు.

**ప్రయాణికులకు వసతి**

బెదిరింపు నేపథ్యంలో ప్రయాణికులకు టెర్మినల్ 2 వద్ద వసతి కల్పించినట్లు అధికారులు తెలిపారు. భద్రతా ప్రమాణాల ప్రకారం విమానాన్ని పూర్తిగా తనిఖీ చేసిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టారు.

**బెదిరింపుపై దర్యాప్తు**

విమానంలో బాంబు ఉందంటూ టిష్యూ పేపర్‌పై హెచ్చరిక రాసిన వ్యక్తి ఎవరు, దాని వెనుక ఉద్దేశం ఏమిటన్నదానిపై భద్రతా సంస్థలు దర్యాప్తు ప్రారంభించాయి. బెదిరింపు ఎలా వచ్చింది, దానికి బాధ్యులెవరన్న కోణంలో విచారణ కొనసాగుతోంది.







# హరిత భవనాలే సుస్థిర భవిష్యత్తుకు మార్గం

**డిప్యూటీ సీఎం భట్టి**

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** పర్యావరణ హిత నిర్మాణాలను ప్రోత్సహించడంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2003లో కేవలం 20 వేల చదరపు అడుగులతో ఒక్క భవనంతో మొదలైన ఐజీబీసీ ప్రస్థానం నేడు 20 వేలకు పైగా ప్రాజెక్టులు, 16.33 బిలియన్ చదరపు అడుగులకు విస్తరించడం గర్వకారణమన్నారు. గ్రీన్ బిల్డింగ్స్ వల్ల విద్యుత్ వినియోగం 50%, నీటి వినియోగం 40% తగ్గుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుస్థిర అభివృద్ధికి కట్టుబడి ఉందని, పునరుత్పాదక ఇంధనం, హరిత భవనాలను ప్రోత్సహిస్తామని భట్టి స్పష్టం చేశారు.

## పంచాయతీల్లో వెట్టిచాకిరీ.. స్వీపర్లపైనే భారం, పాయింట్ షర్టులతో చక్కర్లు కొడుతున్న మరికొందరు



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారిలో అత్యధిక శాతం మంది ఎస్సీలు కావడం, వారితోనే చెత్త, మురికి కాలువల్లో వెట్టిచాకిరీ చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రామాల్లో చెత్త సేకరణ, మురికి కాలువల శుభ్రం వంటి అత్యంత కష్టమైన పనులన్నీ వారితోనే చేయిస్తూ, అదే పంచాయతీలోని మరికొంతమంది సిబ్బంది మాత్రం పాయింట్ షర్టులు వేసుకుని సెక్రటరీ స్థాయిలో చలామణి అవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సర్పంచులు, సెక్రటరీలు తమకు అనుకూలంగా ఉన్న కొంతమందిని తొత్తులుగా పెట్టుకుని, ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని, నిబంధనల ప్రకారం అందరికీ సమానంగా పని కేటాయించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి:**
పంచాయతీ సిబ్బంది పని విధానంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామ పంచాయతీలో సిబ్బంది హాజరు, వారి పని తీరుపై విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పక్షపాతం లేకుండా ప్రతి ఒక్కరూ చెమటోడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# విముక్తి జాతుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి




**బీసీ అభివృద్ధి అధికారిణి గ్రేసమ్మ**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం, వివక్షకు గురైన విముక్తి జాతుల అభివృద్ధికి ప్రభుత్వం, సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి ఐ. గ్రేసమ్మ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సముదాయంలోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో విముక్తి జాతుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చారిత్రకంగా వివక్షకు గురైన విముక్తి జాతుల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, సమాజం కూడా తన వంతు బాధ్యతగా సహకరించాలని కోరారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రత వంటి రంగాల్లో విముక్తి జాతులకు సమాన అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సూచించారు. ముఖ్యంగా యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం ద్వారా వారు స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేసినప్పుడే సంచార, అర్ధ సంచార వర్గాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వల్లపు సోమరాజు, డాక్టర్ కె.వి. కృష్ణారావు, దేరంగుల బ్రహ్మం, పొదిలి నరసింహ రావు, షేక్ మస్తాన్, పఠాన్ బడే ఖాన్, బత్తుల గోపాల్, ఒర్సు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ కుర్చీల ప్రజావాణి.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం?



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఫోటోలో కనిపిస్తున్న ఖాళీ కుర్చీలు, వెనుక గోడకు వేలాడుతున్న 'ప్రజావాణి' బ్యానర్... ఇది కేవలం ఒక ఫోటో కాదు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి ప్రత్యక్ష సాక్ష్యం. ప్రజల కోసమే పరిపాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వంలో, ప్రజల గోడు వినడానికి ఒక్క అధికారి కూడా లేకపోవడం ఏమిటి?సోమవారం అయినా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రతి అర్జీకి రశీదు ఇవ్వాలనేది ప్రభుత్వ ఆదేశం. కానీ కూసుమంచి మండల కేంద్రంలో పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. 31, 2026, 12:25 PM. అంటే మధ్యాహ్నం 12 గంటలు దాటినా కార్యాలయంలో నోడల్ అధికారి లేరు, కనీసం కుర్చీల్లో కూర్చునే ఉద్యోగి లేడు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఇద్దరు ముగ్గురు సామాన్యులు చేతిలో అర్జీ పట్టుకుని నిలబడి ఉన్నారు.

**ఇది కేవలం అధికారుల నిర్లక్ష్యమా? వ్యవస్థ వైఫల్యమా**
మంత్రి సొంత నియోజకవర్గంలోనే ఇలా ఉంటే? ఇది సాధారణ మండలం కాదు. రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి. ఇక్కడే పరిస్థితి ఇలా ఉంటే, రాష్ట్రంలోని మారుమూల మండలాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

**ప్రజావాణి అంటే ఫోటోల కోసమా?**
ప్రజావాణికి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, పరిష్కార స్థితిని ప్రజలకు తెలియజేయాలి. కానీ అధికారులు హాజరు కాకపోతే అర్జీలు ఎవరు తీసుకుంటారు? ఎవరు అప్‌లోడ్ చేస్తారు? చివరికి ఇది కేవలం ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోతుంది.తమ పొలం పనులు, కూలీ పనులు మానుకుని, బస్సు చార్జీలు పెట్టుకుని మండల కేంద్రానికి వచ్చే నిరుపేదలకు ఖాళీ కుర్చీలు దర్శనమిస్తే వారికి ప్రభుత్వంపై ఎంత నమ్మకం పోతుంది? ఇది ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే.

**ప్రభుత్వం చేయాల్సింది ఏమిటి?**
ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కూసుమంచి ప్రజావాణి ఫోటోపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి. ఆ రోజు డ్యూటీలో ఉండి గైర్హాజరైన నోడల్ ఆఫీసర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రజావాణి అనేది కేవలం తూతూ మంత్రంగా కాకుండా, నిజంగా ప్రజల గొంతుక వినే వేదికగా మారాలి.
లేకపోతే... గోడలపై ఉన్న 'ప్రజావాణి' అక్షరాలు, కుర్చీల్లో కూర్చొని నవ్వుతున్నట్లు కనిపించే ప్రజావాణి బొమ్మలు మాత్రమే మిగులుతాయి, ప్రజలకు న్యాయం మాత్రం జరగదు.

## కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి.. ఇద్దరు అరెస్ట్



**రాజముద్ర న్యూస్, బెజ్జూర్:** మండలంలోని మర్తిడి గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. పుంజులకు కత్తులు కట్టి డబ్బులు పెట్టి కోడిపందాలు ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ విష్ణు, కానిస్టేబుళ్లు మల్లేష్, మహేందర్, మహేష్ లు అక్కడికి వెళ్లి ధర్జి సాయి, మాత్రం నారాయణ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, రెండు కోడి పుంజులు, రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను గమనించి మరో ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.

## ఘనంగా నందమూరి సుహాసిని జన్మదిన వేడుకలు

**బాణసంచా పేల్చి, స్వీట్స్ పంచిపెట్టిన టిడిపి నాయకులు**



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ తెలుగుదేశం పార్టీ మాజీ ఉపాధ్యక్షురాలు, కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ నందమూరి సుహాసిని జన్మదిన వేడుకలు కే పి హెచ్ బి కాలనీ లో తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాణా సంచా కాల్చి స్వీట్స్ పంచడం జరిగింది. ఈ సందర్భంగా కెపిహెచ్బి కాలనీ డివిజన్ అధ్యక్షులు షేక్ సత్తార్ మాట్లాడుతూ నందమూరి సుహాసిని జీవితంలో ఎంతో ముందుకు వెళుతూ, మరెన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత శిఖరాలను అందుకోవాలని మనస్పూర్తిగా కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడక్ కమిటీ సభ్యురాలైన ఉప్పల పద్మా చౌదరి సీనియర్ నాయకులు అట్లూరి దీపక్, వెంకట శివయ్య, శాస్త్రి, కేతినేని చౌదరి, కేతినేని కిషోర్, చెరకూరి రవి, సుబ్బారావు, ఉమా, రమాదేవి, కొల్లూరి శ్రీనివాస్, నాయుడు, సాంబశివరావు, వడ్లమూడి శ్రీనివాసరావు పూర్ణ, మదన్, పవన్ మార్నే, కొండలరావు, ఉగ్ర నరసింహ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న జగదీష్

**పార్టీలోకి ఆహ్వానించిన జనసేన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తల్లూరి రామ్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగదీష్ ఆదివారము జనసేన పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జనసేన పార్టీ సిద్ధాంతాలు ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా యువతను చైతన్యపరిచే ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పని చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నిర్దేశించిన నిబంధనలు, క్రమశిక్షణకు కట్టుబడి పార్టీ నాయకత్వం అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ జనసేన పార్టీని వికారాబాద్ జిల్లాలో మరింత భాలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలను అదనపు ఎస్పీ నేరుగా కలిసి వారి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించగా, అదనపు ఎస్పీ వాటిని సానుకూలంగా విని, సంబంధిత అధికారులు, పోలీస్ సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయించినప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా, వేగవంతంగా స్పందించి, వారికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో వారి సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

అక్షర రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

## డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలించిన ఏఈఓ రాకేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గిద్ద , రాధయపల్లె గ్రామంలో క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను ఏఈఓ రాకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు రైతులకు పలు కీలక సూచనలు చేయడం జరిగింది.సర్వేయర్లకు సూచనలు సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత కచ్చితంగా నమోదు చేయాలి. సర్వేయర్లు నమోదు చేసే ఈ వివరాలనే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా తీసుకుంటారు కాబట్టి, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలి.రైతులకు సూచనలు: డిజిటల్ క్రాప్ బుకింగ్ ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. రైతులు తమ గ్రామ సర్వేయర్‌కు అందుబాటులో ఉండి, తమ సర్వే నంబర్ల వారీగా సాగు చేస్తున్న పంట వివరాలను పంట రకాన్ని సరిగ్గా నమోదు చేసుకోవాలని సూచడమైనది.ఇట్టి కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, లక్ష్మణ్, రఫీక్ సర్వేయర్స్ లింబాద్రి, సాయికుమార్ పాల్గొన్నారు.

## సర్పంచ్ సతి.. పవర్ మాత్రం పదిదే..

### గ్రామపంచాయతీలో భర్తదే అసలు హవా

**రాజముద్ర న్యూస్, జైనూర్:** గ్రామపంచాయతీకి సర్పంచ్గా భార్య కొనసాగుతున్నప్పటికీ, పంచాయతీ వ్యవహారాల్లో మాత్రం భర్తే కీలకంగా వ్యవహరిస్తున్నారనే చర్చ స్థానికంగా హాట్టాపిక్గా మారుతుంది. సర్పంచ్ పదవి భార్యకు దక్కినా.. గ్రామంలో జరిగే పలు కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల విషయంలో భర్త చురుగ్గ వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామస్తులు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లే సమయంలో భర్త కూడా వెంట ఉండటం, పలు విషయాల్లో ఆయన స్పందించడం, గ్రామానికి సంబంధించిన కార్యక్రమాల్లో ముందుండటం కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో "పదవి సర్పంచ్ది.. పవర్ మాత్రం భర్తదే" అంటూ గ్రామంలో చర్చ సాగుతోంది. గ్రామ అభివృద్ధి పనులు, పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, రహదారులు వంటి ప్రజా సమస్యల పరిష్కారంలో సర్పంచ్ కుటుంబం చురుగ్గా పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. అదే సమయంలో పంచాయతీ పరిపాలనలో అధికారికంగా ఎన్నికైన సర్పంచ్దే తుది బాధ్యత అని, ప్రజలకు జవాబుదారీగా పాలన సాగాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే భర్త జోక్యం అధికారిక పరిపాలనను ప్రభావితం చేస్తుందా..? లేక సర్పంచ్కు సహకారంగా మాత్రమే వ్యవహరిస్తున్నారా..? అనే విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సర్పంచ్ కుటుంబం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే పాలన కొనసాగాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జంగం గ్రామంలో అంధకారం

### వీధి దీపాలు వెలగక ప్రజలకు ఇబ్బందులు



**రాజముద్ర న్యూస్, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో అంధకారం నెలకొంటుంది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ప్రజలు, వృద్ధులు, మహిళలు చీకట్లో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల వీధిదీపాలు పని చేయకపోవడంతో చీకటి సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాలు పనిచేయకపోవడంతో గ్రామం రాత్రివేళ ఇలా చీకట్లోనే కనిపిస్తోందని, అధికారులు వెంటనే స్పందించి పనిచేయని లైట్లను మరమ్మతులు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## తెలంగాణ అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్గా మట్టా రాగమయి దయానంద్




**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్గా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నియమితులై, సోమవారం చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అసెంబ్లీ లైబ్రరీ కమిటీ చైర్మన్గా బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ అసెంబ్లీ లైబ్రరీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. శాసనసభ్యులకు అవసరమైన విజ్ఞానం, సమాచారం సులభంగా అందుబాటులో ఉండేలా లైబ్రరీ సేవలను మెరుగుపర్చడంతో పాటు, ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అసెంబ్లీ లైబ్రరీ కమిటీ సభ్యులు, అధికారులు, సిబ్బంది మట్టా రాగమయి దయానంద్ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. లైబ్రరీ అభివృద్ధికి కమిటీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

## ఒంటరిగా నివసించే వితంతు, వృద్ధ మహిళలను లక్ష్యం

- దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలకు చోరీ
- దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితురాలు అరెస్ట్
- తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులు కర్ణాటక రాష్ట్రంలో 3 కేసులు
- సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించిన వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఒంటరిగా నివసించే వితంతు వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలను చోరీ చేస్తున్న అంత రాష్ట్రా న్నిందితురాలు అరెస్టు చేయడం జరిగింది. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు జిల్లాలో మహిళలు, వృద్ధుల భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న నేరాలపై వికారాబాద్ జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోటుచేసుకున్న దొంగతనాల కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఈ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతరం దర్యాప్తు చేపట్టారు. నేరాలు జరిగిన ప్రాంతాలు, నేరాల తీరును క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితురాలి కదలికలను గుర్తించారు.

దర్యాప్తులో భాగంగా వివిధ ప్రాంతాల్లో నిందితురాలి కదలికలు, గతంలో ఆమె పాల్పడిన నేరాల వివరాలు, నేరం చేసిన విధానం తదితర అంశాలను విశ్లేషించారు. ఈ క్రమంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న అంతర్‌రాష్ట్ర నిందితురాలిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**నిందితురాలి నేర విధానం**

నిందితురాలు ప్రధానంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను గుర్తించి వారిని లక్ష్యంగా చేసుకునేది. ముందుగా వారితో పరిచయం ఏర్పరచుకుని, వివిధ విషయాలపై మాట్లాడటం, వారి దృష్టిని మరల్చడం వంటి పద్ధతులను ఉపయోగించి, వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్‌లు, గాజులు తదితర ఆభరణాలను అపహరించేది. నిందితురాలు ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి కూడా ఇదే తరహాలో నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ నేతృత్వంలో చేపట్టిన దర్యాప్తులో నిందితురాలి నేరాలకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించి, ఆమె ప్రమేయం ఉన్న కేసులను గుర్తించారు.

**తాండూరు టౌన్ పిఎస్ పరిధిలో 5 కేసులు ఛేదింపు**

నిందితురాలి ప్రమేయం ఉన్న తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 కేసుల్లో మొత్తం కలిపి సుమారు 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. తాండూరు కేసుల దర్యాప్తు సందర్భంగా నిందితురాలు గతంలో కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, నవనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో మొత్తం 14.5 తులాల బంగారు ఆభరణాల దొంగతనాలకు సంబంధించి కూడా నిందితురాలి ప్రమేయం ఉన్నట్లు అధికారులు దర్యాప్తులో గుర్తించారు.

**నిందితురాలిని గుర్తించడంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ కీలక పాత్ర**

వరుసగా నమోదైన ఈ కేసులను ఛేదించేందుకు వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ ప్రత్యేక బృందంతో కలిసి నిరంతరం దర్యాప్తు చేపట్టారు. నేరం జరిగిన ప్రాంతాలు, బాధితుల వివరాలు, నేరం జరిగిన విధానం, నిందితురాలి కదలికలు, సాంకేతిక ఆధారాలు తదితర అంశాలను సమగ్రంగా విశ్లేషించి, కేసుల మధ్య ఉన్న సారూప్యతలను గుర్తించారు. తాండూరులో నమోదైన కేసులకు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసులకు మధ్య ఉన్న నేర విధానాన్ని పోల్చి పరిశీలించడం ద్వారా నిందితురాలి ప్రమేయాన్ని గుర్తించడం జరిగింది.
సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ నిరంతర కృషి, సమర్థవంతమైన దర్యాప్తు, సాంకేతిక ఆధారాల విశ్లేషణ ఫలితంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. సీసీఎస్ అధికారులు నిందితురాలి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌ను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నిందితురాలిపై గతంలో మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో ఎం ఐ డి సి పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, బర్షి పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, హైదరాబాద్ సిటీ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదైనట్లు గుర్తించారు.

**మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి**

ఈ సందర్భంగా సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధులు ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ దృష్టిని మరల్చే విధంగా ఎవరైనా ప్రయత్నించినా, అనుమానాస్పదంగా ప్రవర్తించినా వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలు విలువైన బంగారు ఆభరణాలను ధరించి ఒంటరిగా బయటకు వెళ్లే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల మాటలను నమ్మి వారి వెంట వెళ్లడం లేదా వ్యక్తిగత వివరాలను వెల్లడించడం చేయవద్దని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తెలిపారు. ఈ కేసుల దర్యాప్తును ప్రత్యేకంగా పర్యవేక్షించిన వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, తాండూరు టౌన్ ఎస్సై మమత ఆధ్వర్యంలో హెచ్ సి లు జయవర్ధన్, శివకుమార్, పీసీ లు రామకృష్ణ, సాయప్ప, శివరాజ్, పాండు, రాజు, రవీందర్ డబ్ల్యూ పిసి గాయత్రి సమన్వయంతో పనిచేశారు. ఈ కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా అభినందించారు.

## మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ :** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ దిశగా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ లతో కలిసి మాదక ద్రవ్యాల నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో గంజాయి విక్రయం, వినియోగంపై 3 కేసులు నమోదు చేయడం జరిగిందని, గంజాయి సాగు చేసిన 36 మంది రైతులకు రైతుబంధు నిలిపివేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు చేసే వారిని గుర్తించాలని, అంగన్వాడి కేంద్రాల ద్వారా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన చేపట్టాలని, విద్యాసంస్థల పరిధిలో 100 మీటర్ల లోపు పాన్, కిరాణా, బెల్ట్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలలో చదివే విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించాలని, ప్రతిరోజు విద్యార్థుల ప్రవర్తన గమనించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆటో, లారీల వాహన తనిఖీ నిర్వహించాలని, మెడికల్ దుకాణాలలో అధిక మోతాదులో మత్తుకు సంబంధించిన మందులను తనిఖీ చేపట్టాలని తెలిపారు. గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి గంజాయి సాగు చేసే వారికి రైతుబంధు నిలిపివేస్తారని ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారికి మానసిక వైద్య నిపుణుల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణులతో కలిసి ఆమె బాధితుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కాగజ్‌నగర్‌కు చెందిన సూర పరమేశ్వర్ రావు, పింఛన్లతో పాటు సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలని కౌటాల, దహేగాం, బెజ్జూర్ మండలాలకు చెందిన షాలు తామి, బద్ది శంకర్, నాయిని సుశీల కోరారు. అలాగే డీఎంఎఫ్‌టీ నిధులు, రోడ్డు పనుల బిల్లులు మంజూరు చేయాలని లింగాపూర్, కెరమెరి మండలాలకు చెందిన బాపూరావు, పుష్పలతలు దరఖాస్తులు అందించారు. వీటితో పాటు మీ–సేవ కేంద్రం కేటాయించాలని కౌటాలకు చెందిన శ్రీశైలం, సంచార జీవులకు సంక్షేమ పథకాలు అందించాలని తెలంగాణ వీరభద్రీయ కుల సంఘం ప్రతినిధులు వినతులు సమర్పించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ పాలకవర్గాన్ని ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలి

### నామినేషన్ల ప్రక్రియను నిలిపివేయాలి



**రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ టౌన్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) పాలకవర్గాన్ని నామినేషన్ పద్ధతిలో కాకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ద్వారానే ఎన్నుకోవాలని జిల్లా పిఏసిఎస్ ఛైర్మన్లు డిమాండ్ చేశారు. సోమవారం వారు ప్రజా ఫిర్యాదు విభాగంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 908 పిఏసిఎస్ ల పదవీ కాలం ముగిసి సంవత్సరానికి పైగా దాటిందని, ఇప్పటికే ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలాన్ని రెండుసార్లు పొడిగించారని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం పదవీ కాలం పూర్తికాగానే వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపకుండా, సొసైటీలోని రైతుల ఆమోదం లేకుండానే పాత పాలకవర్గాలను తొలగించి నామినేషన్ పద్ధతి ద్వారా నూతన పాలకవర్గాలను నియమించేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. తక్షణమే ఈ నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసి, త్వరితగతిన పిఏసిఎస్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ ఛైర్మన్లు అలిబిన్ అహ్మద్, జబరి పెంటు, కుమారం మంతయ్య, తిరుపతి గౌడ్, చుంచు శ్రీనివాస్, ఎం. శంకర్, హన్ను పటేల్, బుర్నూర్ శివాజీతో పాటు డైరెక్టర్లు ఎన్. ఆశన్న, పి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంధాన మరో మైలురాయి.. పరుగుల్లో నంబర్-2!

- సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టిన భారత ఓపెనర్
- అంతర్జాతీయ క్రికెట్‌లో 10,756 పరుగులు
- అగ్రస్థానంలో మిథాలీ రాజ్
- మూడు ఫార్మాట్లలో మంధాన రికార్డుల జోరు
- వన్డేల్లోనూ వెయ్యి పరుగుల అరుదైన ఘనత

**దుబాయ్:** భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకుంది. మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 పరుగులు చేసిన మంధాన..







న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన ఖాతాలో ప్రస్తుతం 10,756 పరుగులు ఉన్నాయి. భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ 10,868 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంధాన ఇప్పటివరకు 9 టెస్టుల్లో 788, 120 వన్డేల్లో 5,411, 172 టీ20ల్లో 4,557 పరుగులు సాధించింది. మూడు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తున్న మంధాన ఇటీవల లార్డ్స్ వేదికగా తన 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసింది. చారిత్రక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల టెస్టులో అర్ధశతకం నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు సాధించింది.

### వన్డేల్లోనూ రికార్డుల మోత

వన్డేల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు సాధించి మంధాన మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 18 ఇన్నింగ్స్‌ల్లో 59 సగటుతో 1,062 పరుగులు చేసి ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్లార్క్ 1997లో 970 పరుగులు సాధించగా.. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంధాన తిరగరాసింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వన్డే పరుగులు చేసిన మహిళల జాబితాలో మంధాన అగ్రస్థానంలో నిలవగా.. దక్షిణాఫ్రికా స్టార్ లారా వోల్వార్ట్ 882 పరుగులతో తర్వాతి స్థానాల్లో నిలిచింది. న్యూజిలాండ్‌కు చెందిన డెబ్బీ హాక్లీ 880, అమీ సాటర్త్‌వైట్ 853 పరుగులతో ఈ జాబితాలో చోటు సంపాదించారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తూ ఒక్కో రికార్డును తన ఖాతాలో వేసుకుంటున్న మంధాన.. ఇప్పుడు అంతర్జాతీయ పరుగుల్లో మిథాలీ రాజ్ రికార్డుకు మరింత చేరువైంది.



# వీనస్‌కు బిగ్ షాక్

## వరుసగా 15వ ఓటమి!

- యూఎస్ ఓపెన్ తొలిరౌండ్‌లోనే ఇంటిముఖం
- సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో పరాజయం
- 46 ఏళ్ల వయసులో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి
- మెగా టోర్నీలో రికార్డు ప్రదర్శనకు నిరాశాజనక ముగింపు
- సింగిల్స్‌లో కొనసాగుతున్న ఓటముల పరంపర

**న్యూయార్క్:** ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను శాసించిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. యూఎస్ ఓపెన్--2026లో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి దిగిన 46 ఏళ్ల వీనస్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో సింగిల్స్‌లో వీనస్‌కు ఇది వరుసగా 15వ ఓటమిగా నమోదైంది. ఇటీవల సిన్సినాటి ఓపెన్‌లోనూ ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన వీనస్.. సొంతగడ్డపై జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లోనైనా సత్తా చాటాలని భావించింది. అయితే తొలి రౌండ్‌లోనే కెనిన్ ఆమె ఆశలకు చెక్ పెట్టింది. తొలి సెట్‌లో వీనస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కెనిన్ 6-2తో సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో వీనస్ గట్టిగా పోరాడినా కీలక సమయంలో కెనిన్ పైచేయి సాధించి మ్యాచ్‌ను ముగించింది. దీంతో కెనిన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా.. వీనస్ సింగిల్స్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన వీనస్.. వయసును సైతం లెక్కచేయకుండా టెన్నిస్ కోర్టులో కొనసాగుతుండటం విశేషం. అయితే ఇటీవలి కాలంలో సింగిల్స్‌లో విజయాలు ఆమెకు దూరమవుతున్నాయి. తాజా పరాజయంతో వరుస ఓటముల సంఖ్య 15కు చేరింది. ఒకప్పుడు ప్రత్యర్థులకు చెమటలు పట్టించిన వీనస్.. ఇప్పుడు ఒక్క విజయం కోసం సుదీర్ఘంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


SOFIA KENIN

# హాకీ వరల్డ్ కప్ 2026 విజేత జర్మనీ

- స్పెయిన్‌పై 1-0తో విజయం!
- వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్
- నాలుగోసారి విశ్వవిజేతగా జర్మనీ
- పాకిస్థాన్ రికార్డు సమం
- అర్జెంటీనాకు కాంస్య పతకం



**వావ్రే, ఆగస్టు 30:** పురుషుల హాకీ ప్రపంచకప్--2026లో జర్మనీ విశ్వవిజేతగా నిలిచింది. బెల్జియంలోని వావ్రేలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో స్పెయిన్‌ను 1-0 గోల్ తేడాతో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. స్పెయిన్ ఎక్కువసేపు బంతిని తన ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు పెనాల్టీ కార్నర్లు సంపాదించినా.. జర్మనీ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది.

### ఒక్క గోల్.. కప్ సొంతం

మూడో క్వార్టర్ చివర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. 44వ నిమిషంలో జర్మనీకి లభించిన అవకాశాన్ని మైకేల్ స్ట్రుతాఫ్ గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్పెయిన్ సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా జర్మనీ రక్షణ గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ముగియడానికి నాలుగు నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగా స్పెయిన్ గోల్‌కీపర్‌ను వెనక్కి తీసుకుని అదనపు అవుట్‌ఫీల్డ్ ఆటగాడిని రంగంలోకి దించింది. చివరి నిమిషాల్లో వరుస దాడులు చేసినా గోల్ మాత్రం దక్కలేదు. చివరి హూటర్ మోగేసరికి 1-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న జర్మనీ ప్రపంచకప్‌ను ముద్దాడింది.

### నాలుగోసారి విశ్వవిజేత

ఈ విజయంతో జర్మనీ నాలుగోసారి పురుషుల హాకీ ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. గతంలో 2002, 2006, 2023లో టైటిళ్లు సాధించిన జర్మనీ.. 2026లో మరోసారి విజేతగా నిలిచి పాకిస్థాన్ పేరిట ఉన్న నాలుగు ప్రపంచకప్‌ల రికార్డును సమం చేసింది. పాకిస్థాన్ 1971, 1978, 1982, 1994లో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు స్పెయిన్‌కు మూడో ప్రపంచకప్ ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. 1971, 1998లో రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టు.. ఈసారి కూడా టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయింది. ఫైనల్లో లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచుకోలేకపోవడం స్పెయిన్‌ను దెబ్బతీసింది. విజయం అనంతరం గోల్ హీరో మైకేల్ స్ట్రుతాఫ్ మాట్లాడుతూ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లతో కూడిన తమ జట్టు సమష్టిగా పోరాడిందని తెలిపాడు. జర్మనీ కెప్టెన్ టామ్ గ్రాంబుష్ తమ తదుపరి లక్ష్యం లాస్ ఏంజెల్స్--2028 ఒలింపిక్స్ అని స్పష్టం చేశాడు.

### అర్జెంటీనాకు కాంస్యం

మూడో స్థానం కోసం జరిగిన పోరులో అర్జెంటీనా 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు తలపడగా 50 మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం 248 గోల్స్ నమోదయ్యాయి. వాటిలో 136 ఫీల్డ్ గోల్స్, 97 పెనాల్టీ కార్నర్ గోల్స్, 15 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్ ఉన్నాయి.

ఒక్క గోల్‌తో ఫైనల్‌ను శాసించిన జర్మనీ.. వరుసగా రెండోసారి కప్పును ముద్దాడి ప్రపంచ హాకీలో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.



# ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు..!

**బ్యూనస్ ఎయిర్స్, ఆగస్టు 31:** ప్రపంచంలోని ఫుట్‌బాల్ అభిమానులకు షాకింగ్ న్యూస్. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. తన ఆటతో కోట్లాదిమందిని మంత్రముగ్ధులను చేసిన ఈ దిగ్గజం సోమవారం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అల్విదా చెప్పేశాడు. ఇటీవలే తన తండ్రి మరణాంతరం మైదానంలోకి దిగిన ఈ ఫార్వర్డ్ ప్లేయర్ హఠాత్తుగా సంచలన నిర్ణయంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రపంచ సాకర్‌లో ఓ శకం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించిన లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. అర్జెంటీనా దిగ్గజ ఆటగాడిగా, వరల్డ్‌కప్ సాధించిన కెప్టెన్‌గా అతడు తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో తన కెప్టెన్సీలో అర్జెంటీనాను ఫిఫా వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన మెస్సీ.. ఈసారి కూడా గట్టిగానే ప్రయత్నించాడు. కానీ, ఫైనల్లో స్పెయిన్ కప్‌ను ఎగరేసుకుపోయింది. తన రిటైర్మెంట్ వార్తను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడీ మెస్సీ. జులై 20న ఫిఫా ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి అనంతరం వీడ్కోలుపై ఆలోచించిన మెస్సీ ఎట్టకేలకు సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ఫిఫా వలర్డ్‌కప్ ఫైనల్ ముగిసినప్పటి నుంచి వీడ్కోలు గురించి ఆలోచిస్తున్నా. అర్జెంటీనా ఫుట్‌బాల్ నుంచి నేను రిటైరవుతున్నాని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నా. ఈ నిర్ణయం నన్నెంతగానో బాధిస్తోంది. అయినా సరే ఇదే సరైన సమయం అనిపించింది' అని మెస్సీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో మూడు పేజీల లేఖను పోస్ట్ చేశాడీ వెటరన్. 'అర్జెంటీనా ఫుట్‌బాల్ కోసం నేను సర్వం ధారపోశాను. గత కొన్ని ఏళ్లు సాధిస్తున్న విజయాలకు ముందు నుంచీ నేను ఎంతో చేశా. అర్జెంటీనా అభిమానులుగా మీరు సంతోషపడేందుకు, గర్వపడేందుకు తెలుపు, నీలం రంగు జెర్సీకోసం నేను ఎంతో పోరాడాను. అయితే.. ఇప్పుడు మరింత సమయం లేదు. విభిన్నమైన అధ్యాయాలు ముగియనున్నాయి. ఈ విషయం నన్ను చాలా బాధిస్తోంది. జాతీయ జట్టుకు ఆడడాన్ని నేను ఎంతో ఇష్టపడ్డాను. ఎల్లప్పుడూ ఇష్టపడతాను కూడా. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు నా స్థానంలో రాబోతున్నారు'అని పేర్కొన్న మెస్సీ.. ఇకపై క్లబ్స్ తరఫున మైదానంలో ఫ్యాన్స్‌ను అలరించనున్నాడు. ప్రస్తుతానికి ఇంటర్ మియామికి ఆడుతున్న మెస్సీ తనను ఎంతో ప్రేమించి, మద్దతుగా నిలిచిన అర్జెంటీనా అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.



# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.






# 'హతః' టైటిల్‌తో కిరణ్ అబ్బవరం కొత్త సినిమా



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న తన రెండో ప్రాజెక్ట్‌కు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. చీకటి వాతావరణంలో ఒక డార్క్ బాక్స్‌లో ఉన్న పిల్లిని చూపిస్తూ, "ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్..." (×ర్ ష్ట్రవ ఝ్ ఖశ్రీఅజవ శీతీ...) అనే సస్పెన్స్ క్యాప్షన్‌తో టైటిల్‌ను రివీల్ చేశారు. పిల్లి బతికే ఉందా లేదా అనే ప్రశ్నతో ప్రేక్షకుల్లో తీవ్ర క్యూరియాసిటీని పెంచే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు చూడని విభిన్నమైన కథాంశంతో, కొత్త జానర్‌లో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. కుష్బు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా, జెసిన్ జార్జ్ సంగీతాన్ని, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలను అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార్'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రలో విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. ఆయనకు ఉన్న ప్రత్యేకమైన నటన శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం.కార్తీ, ఎస్‌జే సూర్య మధ్య జరిగే పోరాటం సినిమాకు కీలకంగా ఉండబోతుందని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రైలర్‌లో విలన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.




Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com